సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 1-10-2024

సంపుటి: 20 సంచిక: 161

పేజీలు: 4 వెల: రూ.1



రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.


## తాగకుండా వీరు అమ్మకుండా వారు ఉండలేరు!





- మంగళవారం మద్యం షాపులు బంద్
- ఉదయాన్నే క్యూలో మందుబాబులు
- బార్‌బాయ్‌లతో ఎక్సైజ్ అధికారులే విక్రయించారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అసలే ఒకటో తారీఖు.. అందులోనూ తెల్లవారిసరికే సామాజిక భద్రతా పింఛన్లు కనీసం రూ.4వేలు అందిన రోజు. సక్కగా ఓ సుక్కేసుకుందామంటే మధ్యలో మందు షాపులు బంద్ అంటే - మిగతా 4లో


SOLVE ACADEMY
Dwaraka Nagar 3rd Line, Data Pro Apartment 3rd Floor, Visakhapatnam.
Ramakrishna Nagar, Behind RTC Complex, Srikakulam, A.P. - 532001.
SSC CONSTABLES & RRB GROUP -D OUR TARGET
COMPETITIVE EXAMS COACHING!!!
*CRASH COURSE (2 Months) 5000 ₹ Only
JOIN TODAY
• 6 HOURS DAILY CLASSES
• COVER COMPLETE SYLLABUS
• ARITHMETIC/REASONING/GS/GK/ENGLISH
• CHAPTER WISE TESTS
• GRAND TESTS
• COURSE PRINTED MATERIAL
FOR MORE INFORMATION : 75690 89825, 90595 20982 86881 72010, 90300 28181



19th Anniversary
Enjoy with JMR Food
మా సంస్థ 19 సం॥లు విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు మా కస్టమర్ దేవుళ్ళకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వార్షికోత్సవం సందర్భంగా మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇదే అభిమానాన్ని ముందుందు అందిస్తారని ఆశిస్తూ...
ఆధునీకరించిన వాతావరణంలో
★ టిఫిన్స్: వెజ్ & నాన్‌వెజ్ (7 AM to 11 AM) (సామాన్యులకు అందుబాటు ధరలలో)
★ సౌత్ ఇండియన్ వెజ్ మీల్స్ ★ ఇండియన్ ★ చైనీస్ ★ తందూరి ★ డిజర్ట్స్
Estd 2005
JMR RESTAURANT
టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, శ్రీకాకుళం ✆ 83318 23334



ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
▸ పచ్చళ్ళు ▸ బట్టలు ▸ పిండివంటలు ▸ బుక్స్ ▸ స్వీట్స్ ▸ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493


## కలెక్టర్‌కే కహానీలు!



- కోర్టు ధిక్కరణ కేసులో ఇరికించే కుట్ర
- సొమ్ములతో నింపేసిన పోస్టులు
- స.హ. చట్టానికి ఇవ్వని పత్రాలు
- వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ సిత్రాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**సొమ్ములివ్వకపోతే సొంత సోదరుడ్ని కూడా క్షమించని అధికారులు వారు. డబ్బుల కోసం స్వయంగా కోర్టును సైతం తప్పుదోవ పట్టించగల నేర్పరులు. ఈ కేసులో స్వయంగా జిల్లా కలెక్టర్ కూడా ఒక పార్టీ అని తెలిసి కూడా ఆయన్ను ఇందులో ఇరికించేయడానికి ఏమాత్రం వెనకడుగు వేయడంలేదు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తమకు సొమ్ములిచ్చినవారికి ఉద్యోగాలిచ్చి, మిగిలినవారిని గాలిలో పెట్టేసి కోర్టు ముందు కలెక్టర్‌ను దోషిగా నిలబెట్టడానికి చేస్తున్న కుట్ర ఇది. కేవలం సొమ్ముల కోసమే జరుగుతున్న ఈ నాటకంలో ఏ రెండు స్టేట్‌మెంట్లకూ పొంతన ఉండటంలేదు. స్వయంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఈ ఫైల్‌ను తెప్పించుకొని స్టడీ చేస్తున్నా అర్థంకాని మెటీరియల్ అందించి కోర్టు ధిక్కరణకు ఆయన్ను బాధ్యుడ్ని చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**

కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో సేవలందించడానికి 2020 మే 20న నిహాల్ అనే ఔట్‌సోర్సింగ్ సంస్థ ద్వారా 71 మంది మేల్ నర్సింగ్ - మిగతా 4లో

## అమ్మోరు దొంగలు దొరికారు!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేటలో శ్రీ రాజరాజేశ్వరి శక్తి పీఠంలో అమ్మవారి నగలను కాజేసిన దొంగల ముఠాను పోలీసులు అతి తక్కువ సమయంలోనే పట్టుకున్నారు. ఈమేరకు జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం పెట్టి వివరాలు తెలిపారు. ఏప్రిల్ 23న కుంచాల కురమయ్యపేటలోని శక్తిపీఠం అమ్మవారి గుడి తాళాలు బద్దలుకొట్టి అమ్మవారి ఒంటిపై ఉన్న 41 తులాల బంగారం, 12 కేజీల వెండి దొంగిలించిన కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 36 తులాల బంగారం, 11.5 కేజీల వెండి, రూ.3.38 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మొత్తం 39 నేరాలకు సంబంధించి 97.38 లక్షలు విలువైన బంగారం, వెండి, నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక వెర్నా కారు కూడా వీరి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో 2021 నుంచి నిరంతరం ఏదో ఒక - మిగతా 4లో


NOW OPEN
The Eastern Marine Drive In
10% DISCOUNT on 999/- FOR SATYAM SUBSCRIBERS
(A/C) FAMILY RESTAURANT
EAT. PLAY. ENJOY.
Chikkol HARBOUR
INDIAN | CHINESE | BIRYANI | TANDOORI
EASTERN MARINE DRIVE-IN
NH16 Service Road, Kushalipuram, Srikakulam
+91 9652629676 / +91 8555918685
Available On zomato



పదవీ విరమణ శుభాకాంక్షలు
Happy Retirement!







43 ఏళ్లు జ్యుడీషియరీ విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి నేడు పదవీ విరమణ చేస్తున్న
చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
శ్రీ ధవళ ఆనందరావు గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు
కొంక్యాన సుభాష్
M.A., M.A., L.L.M
సీనియర్ అడ్వకేట్, శ్రీకాకుళం





## ఆర్థికమంత్రిపై కేసు వెనుక కథ ఇది!

- ఈడీని ఉసిగొల్పి డబ్బులు లాగారంటూ కోర్టుకెళ్లిన మాజీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- పేపర్ కటింగులతో కోర్టును ఆశ్రయించిన వైనం
- వేలకోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లను చట్టవ్యతిరేకమంటూ తేల్చిన సుప్రీంకోర్టు

- దుప్పల రవికుమార్

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 16,492 కోట్ల రూపాయలు. మొన్న మార్చి 30న భారత ఎన్నికల కమిషన్ పుణ్యమా అని ఎలక్టొరల్ బాండ్ల ముసుగు తొలగింది. మన రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు ఎవరెవరు ఎంత సొమ్ము విరా ళంగా ఇచ్చిందీ మనకు తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వది లేసి సామాజిక ఉద్యమకారుడిగా మారిన కర్ణాటకకు చెందిన యాభై ఏళ్ల ఆదర్శ అయ్యర్ దీనిమీద ఒక పోలీస్ కంప్లెయింట్ ఇచ్చాడు. మన దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు కర్ణాటకకు చెందిన భాజపా పెద్దలు నళిన్ కుమార్ కటిల్, బివై విజయేంద్ర లాంటి కొందరు నేతలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) లాంటి విచారణ సంస్థలను అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలను ఎలక్టొరల్ బాండ్ల రూపంలో దోచుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భాజపా తీసుకొచ్చిన ఈ ఎలక్టొరల్ బాండ్ల పథకంలో వ్యక్తులైనా, సంస్థలైనా తమ వివరాలు వెల్లడి చేయకుండా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వవచ్చు. ఆరేళ్ల కిందట ప్రవేశ పెట్టిన ఈ పథకంలో అతిపెద్ద లబ్ది దారు బిజెపియే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! దాదాపు 30 రిజిస్టర్డు రాజకీయ సంస్థలకంటే ఎక్కువగా బిజెపి ఈ ఎలొక్టరల్ బాండ్ల ద్వారా 8,252 కోట్ల రూపాయలను పొందింది. ఈ పథకాన్ని సుప్రీంకోర్టు చట్ట వ్యతిరేకమని ప్రకటించింది. ఆదర్శ అయ్యర్ ప్రకారం బిజెపి ఇందులో ఎక్కువ డబ్బు సంపాదించడానికి కారణం ఈడీ లాంటి విచారణ ఏజెన్సీలను వాడి కార్పొరేట్ సంస్థలను బెదిరించి డబ్బులు గుంజడమే.

### ఊహించని ట్విస్ట్

ఈ వార్తలు పత్రికలలో వచ్చిన తర్వాత అయ్యర్ తన స్నేహితులతో కలిసి తిలక్‌నగర్ పోలీస్ స్టేషనులో దాదాపు 15 ఫిర్యాదులు దాఖలు చేశారు. కేసులలో ఎలాంటి పురోగతీ లేకపోయేసరికి, అందులో ఒక్క ఫిర్యాదు పట్టుకుని ఏప్రిల్ 15న కర్నాటక సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్కడికి ఆరు నెలలకు గౌరవ కోర్టు సీతారామన్‌తో పాటు ఇతర నాయకులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని పోలీసులను ఆదేశించింది. దీంతో తప్పని పరిస్థితులలో మొదటి ముద్దాయి నిర్మలగాను, తర్వాతి ముద్దాయిలుగా కటిల్, విజయేంద్ర, మరికొందరు ప్రాచుర్యం లేని నేత లతో పాటు ఈడీ అధిరులను చేరుస్తూ 0224/2024 నెంబరుతో దోపి డీ, క్రిమినల్ కుట్రలకు పాల్పడిన నేరాలపై ఎఫ్ఐఆర్ దాఖలయింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భూవివాదం నుంచి ప్రజల దృష్టి మళ్లిం చడానికి కాంగ్రెస్ ఆడుతున్న నాటకంగా ఈ కేసును బిజెపి అభివర్ణించింది. సెప్టెంబరు 30న ఈ కేసును విచారిస్తూ తదుపరి వాయిదా అక్టోబరు 22 వరకూ దీనిపై ఇంటెరిం స్టే విధించింది కర్ణాటక హైకోర్టు.

ఆదర్శ అయ్యర్ 2015లో కర్ణాటర లోకాయుక్త కార్యాలయంలో జరిగిన అవినీతి కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోర్టుకీడ్చారు. అంతే కాకుండా కరోనా సమయంలో కొందరు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిం చిన సందర్భంలో విద్యాశాఖ మంత్రిని బోనుకెక్కించారు. జనతాదళ్ నేతలు పాల్పడిన భూదందా కేసును కూడా తవ్వితోడిన చరిత్ర ఈయ నకుంది. రెండు దశాబ్దాల కిందట అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండే ఆదర్శను రెండు సినిమాలు మార్చాయి. బ్రూస్ విల్లిస్ నటించిన "టియర్స్ ఆఫ్ ది సన్", షారూక్‌ఖాన్ నటించిన "స్వదేశ్" సినిమాలు చూసి ఆలోచనలో పడిన ఆదర్శ 2005లో ఉద్యోగం వది లేసి స్వదేశానికి తిరిగి వచ్చేసాడు. మొదట అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పనిచేశాడు. లా కోర్సులో ప్రవేశం పొంది కర్ణా టకలో ఆమ్ ఆద్మీ పార్టీ కోసం పని చేసాడు. 2015లో తన స్నేహి తులతో కలిసి జనాధికార సంఘర్ష పరిషత్ ఏర్పాటు చేసి, పౌర హక్కుల ఉద్యమంలో పనిచేస్తున్నాడు.

### పత్రికలలో వచ్చిన వార్తలే ఆధారాలు

ప్రస్తుతం ఆర్థిక మంత్రి విషయంలో కోర్టుకెక్కిన ఈ కేసులో రెండే రెండు కంపెనీల గురించి ప్రస్తావించారు. అవి వేదాంత మైనింగ్, అరబిందో ఫార్మా కంపెనీలు. ఆర్థిక మంత్రి తన ఆధీనంలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను వేదాంత సంస్థ తమిళనాడు శాఖపై ఆగస్టు 2022లో దాడి చేసింది. వేదాంత కంపెనీ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరానికి కొంత లంచం ముట్టజెప్పి పంజాబ్‌లో పవర్ ప్లాంట్ తెరిచిందని ఇడి ఆరోపిస్తూ జరిపిన దాడి అది. దాంతో నవం బర్ 2022లో వేదాంత సంస్థ వంద కోట్ల రూపాయలను ఎలొక్టరల్ బాండ్లకు విరాళంగా అందించింది. ఏప్రిల్ 2019 నుండి నవం బరు 2023 వరకూ వేదాంత సంస్థ 230 కోట్ల రూపాయలను విరాళంగా ప్రకటించడం వెనుక మతలబు గురించి పోలీసులు పరిశోధించాలని ఆదర్శ కోర్టును కోరాడు. దానికి సంబంధించిన వివరాలన్నీ కోర్టు ముందుంచాడు. దాంతోపాటు నవంబరు 2022లో అరబిందో ఫార్మా నుంచి 49.5 కోట్ల రూపాయలను విరాళంగా సేకరించారు. దీని వెనుక కూడా ఈడీ బెదిరింపులు ఉన్నాయని, ఆ సమయంలో ఈడీ అరబిందోపై జరిపిన దాడుల ఫైళ్లు కోర్టుకు అందజేశారు. వీటిపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని నిజాలు బయటపడతాయని వారు కోర్టును అభ్యర్థించారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఎవరూ ఊహించలేదు. అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఒక రాష్ట్ర న్యాయస్థానం దేశ ఆర్థికమంత్రిపై కేసు పెట్టమని ఆదేశించడంతో ఒక్కసారి దేశం దృష్టి అటు మళ్లింది. ఈ కేసును భాజపా పెద్దలు, కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా తీసుకుంటుందో రాబోయే రోజుల్లో తెలుస్తుంది.

• ఎడిటోరియల్

# బ్యాంకుల్లో డిపాజిట్లు లేవు

తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందన్నట్టుంది కేంద్ర సర్కార్ తీరు. గత పదేళ్లుగా ఫ్రీ మార్కెట్ పేరుతో స్టాక్ మార్కెట్లకు అనుకూలంగా ప్రచారం ప్రారంభించింది. బ్యాంకింగ్ రంగ సంక్షోభానికి ఇది దారి తీసింది. మొన్న బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానమిస్తూ నిర్మలా సీతారామన్ మధ్య తరగతి ప్రజలు చాలా స్మార్ట్‌గా తయారయ్యారని, తమ సేవింగ్స్‌ను స్టాక్ మార్కెట్లకు, రియల్ ఎస్టేట్‌కు మళ్లిస్తున్నారని అన్నారు. వారికి లాభం చేకూరేలా లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఇండెక్సేషన్ పునరుద్ధరిస్తున్నామని అన్నారు. అదే నేడు బ్యాంకులకు ఉరితాడయ్యింది. ఇదంతా దాచి 'బండికి రెండు చక్రాలు ఎలాగో బ్యాంకింగ్ రంగానికి డిపాజిట్లు, రుణాలు కూడా అటువంటివే. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన బ్యాంకింగ్ రంగం సజావుగా సాగాలంటే డిపాజిట్లు, రుణాల నడక కూడా సక్రమంగా ఉండాలి' అంటూ కొద్ది రోజులుగా రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ సుద్దులు వల్లిస్తున్నారు. బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సంక్షోభం ఎదుర్కొంటోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో జరిగిన రిజర్వుబ్యాంకు బోర్డు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని, డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా ఇవ్వాలని ఉచిత సలహా పడేశారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ డిపాజిట్ల సేకరణ కోసం ఆకర్షణీయమైన, వినూత్న పథకాలను ప్రవేశ పెట్టాలని చెప్పడంతో పాటు, మరికొన్ని సూచనలు చేశారు. రిజర్వుబ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ 2023 నాటికి మొత్తం దేశీయ డిపాజిట్లు 4.8 శాతం తగ్గినట్టు నివేదిక పేర్కొంది. 1995 తర్వాత వార్షిక డిపాజిట్లలో ఈ స్థాయి తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. గత ఏడాది 43.5 శాతంగా ఉన్న కరెంటు అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (సిఎఎస్‌ఎ) డిపాజిట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 41 శాతానికి తగ్గాయి. ఇది దాదాపుగా కరోనా వ్యాప్తికి ముందున్న సంవత్సరాలకు సమానం. రిజర్వు బ్యాంకుతో పాటు ఎస్‌బీఐ నివేదిక కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రానున్న రోజుల్లో ఈ క్షీణత మరింతగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గడానికి దారితీసిన అసలైన కారణాలను రిజర్వుబ్యాంకు గానీ, ప్రభుత్వంగానీ గుర్తించిందా అన్నదే అసలైన ప్రశ్న. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ నెలలో) రిజర్వు బ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారమే మన దేశంలో పొదుపు గణనీయంగా పడిపోయింది. దేశంలోని కుటుంబాల నికర పొదుపు 47 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందని ఆ నివేదికలో రిజర్వుబ్యాంకే పేర్కొంది. 2022లో దేశ జిడిపిలో 7.3 శాతంగా ఉన్న పొదుపు 2023లో 5.3 శాతానికి పడిపోయింది. బ్యాంకుల డిపాజిట్లతో పాటు స్టాక్స్‌ను కూడా పరిగణలోకి తీసుకుని ఈ పొదుపు లెక్కలను ఆర్‌బీఐ రూపొందించడం గమనార్హం. ఆ నివేదికలోనే కుటుంబాల అప్పులు గణనీయంగా పెరుగుతున్నాయని కూడా ఆర్‌బిఐ పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల మొత్తం దేశ జీడీపీలో 5.8 శాతంగా ఉంది. 1970 తర్వాత కుటుంబాల రుణం ఈ స్థాయిలో పెరగడం ఇది రెండోసారి! అప్పులు పెరిగితే కష్టపడి సంపాదించినదంతా దానిని తీర్చడానికే సరిపోతుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక పొదుపు చేయడానికి అవకాశం ఎక్కడిది? ఒకప్పుడు పొదుపు చేయడమంటేనే వివిధ దేశాల్లోని ప్రజలు ఇండియాను గుర్తుచేసుకునేవారు. చుక్కలను దాటి పరుగులు తీస్తున్న ధరలు ఆ పరిస్థితిని మార్చివేస్తున్నాయి. కనీస అవసరాలను తీర్చుకోవడానికే సామాన్యులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల విడుదలైన ఒక నివేదిక సామాన్యులపై ధరాఘాతం ఏ స్థాయిలో ఉందో తెలియచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం నిత్యావసరాల కోసం 2022వ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ (త్రైమాసికం)లో చేసిన ఖర్చుకంటే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18 శాతం అధికంగా భారతీయ కుటుంబాలు ఖర్చు చేశాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులున్నాయని ఈ నివేదికలో పేర్కొన్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం ఇలా అన్నీ తడిసి మోపెడవుతున్నాయి. పెరిగిన ఖర్చులకు తగ్గట్టుగా ప్రజల నిజ వేతనాలు పెరగడం లేదన్నది సుస్పష్టం. కొంచెం అటుఇటుగా పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగుతున్న ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. అధిక ధరలకు కళ్లెం వేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున కల్పించాలి. అప్పుడే ప్రజల చేతుల్లో డబ్బు ఉంటుంది. పొదుపు చేయడం సాధ్యమవుతుంది. ఈ చర్యలు తీసుకోకుండా వడ్డీ రేట్లను పెంచినా ఫలితం శూన్యం.

## 26వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమం అరసవల్లి 26వ డివిజన్‌లో ఉదయం ఐదున్నర గంటల నుంచి ప్రారంభమైంది. నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి పెన్షన్‌ను పంపిణీ చేశారు. రమణమూర్తి, ఉంగటి పాపారావు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఉదయం 7 గంటలకే 90 శాతం పంపిణీ పూర్తి చేశారు. కార్యక్రమంలో రాయపిల్లి అర్జున్, సచివాలయ అడ్మిన్ బట్న రవితేజ, సచివాలయ ఏఎన్‌ఎం కుమారి, శ్రీనివాస్, దుర్గ, సిబ్బంది ఉంగటి రామ్మోహన్, రుప్ప లక్ష్మణ్, మాధవ, అప్పలస్వామి, సంతు, అప్పన్న బృందం, ఖాజీపేట పంపుహౌస్ కాలనీవాసులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు వరం హైస్కూల్ విద్యార్థులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీలలో ఏవీఎన్‌ఎం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఇందిరామణి తెలిపారు. జూడోలో ఏడవ తరగతి విద్యార్థిని జి.జీవన్ ప్రియ ఎంపికవగా, టైక్వాండోలో టి.ఝాన్సీ, టి.సునీత, బాక్సింగ్‌లో ఎ.రామచరణమూర్తి, చెస్‌లో పి.కీర్తన ఎంపికయ్యారు. అలాగే పాఠశాల హాకీ టీం కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు బి.తారాబాయి, ఎస్.అప్పలరాజులను హెచ్‌ఎం పి.ఇందిరామణి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.



## కిల్లిపాలెం ఎంపీపీ స్కూల్‌లో బొమ్మలకొలువు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

దసరా పండగను పురస్కరించుకొని కిల్లిపాలెం ఎంపీపీ స్కూల్‌లో బొమ్మలకొలువు పెట్టారు. పిల్లల్లో సృజనాత్మక అభివృద్ధి చేయాలని ఈ కొలువు నిర్వహించినట్టు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సందర్శించారు. కార్యక్రమంలో కరుణశ్రీ, డీవీయన్ పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా వ్యవసాయ అధికారిగా త్రినాథస్వామి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వ్యవసాయ అధికారిగా కె.త్రినాథస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయ అధికారిగా పని చేసిన కె.శ్రీధర్ పదవీ విరమణ నేపథ్యంలో త్రినాథ స్వామిని ఆ పదవిలో పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటివరకు ఈయన జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని జిల్లా వనరుల కేంద్రంలో వ్యవసాయ ఉపసంచాలకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం

### - శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
### - కొత్తూరు సైరిగాంలో పింఛన్లు పంపిణీ

(సత్యంన్యూస్, గార)

కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అవ్వతాతలకు ఒకటో తేదీకి పెంచిన పింఛన్ రూ.4వేలు అందజేసి వారిలో ఆనందం నింపుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కొత్తూరు సైరిగాంలో ఎమ్మెల్యే శంకర్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఒకటో తేదీనే పేదలకు పింఛన్లు అందజేస్తున్నట్లు వివరించారు. ఏ ఆసరా లేని వృద్ధులకు, నిరాశ్రయులకు పింఛన్ అందజేసి వారిని ఆదుకుంటుందని చెప్పారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గార మండల కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అక్టోబర్ 3 నుంచి టెట్ పరీక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలో టెట్ పరీక్ష నిర్వహణ అక్టోబర్ 3వ తేదీన నుంచి ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. టెట్ పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహణ జరుగుతుందని, ఎచ్చెర్లలో రెండు పరీక్ష కేంద్రాలు, నరసన్నపేటలో ఒక పరీక్ష కేంద్రం, బరంపురంలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సిబిటి) అక్టోబర్ 3 నుంచి 21 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు ఉంటాయని తెలిపారు. ఎచ్చెర్లలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలోను, శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలోను, నరసన్నపేటలో గొట్టిపల్లి దగ్గర కోర్ టెక్నాలజీ కళాశాలలో జరుతాయన్నారు. బరంపురంలో అయాన్ డిజిటల్ జోన్ కాలికట్ కళాశాలలో ఒక పరీక్ష కేంద్రం, రెండవ కేంద్రం చాండీపథర్, ఎస్.ఎం.ఐ.టి. డిగ్రీ ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ సెంటర్ కళాశాలలోను, మూడవ కేంద్రం బృందాబన్ బిహార్ అంకూష్ పూర్ ఎస్.ఎం.ఐ.టి. ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ నిరంతరాయంగా ఉండాలని, పోలీసు శాఖ బందోబస్తు, ఆర్టీసి విద్యార్థులకు సరిపడ బస్సులు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమిక చికిత్స ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి 97031 48269, 79891 39860, 94940 94904, 91779 75250 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.




# ఆ పాట రాగానే..
# థియేటర్‌లో పూనకాలు లోడింగ్!

ఐ యాం ఎ డిస్కో డ్యాన్సర్ అని గిటార్ పట్టుకుని మిథున్ పాట అందుకోగానే ఇక్కడ థియేటర్లో వందలాది గొంతుకలు కోరస్ కలిపాయ్.. ఈలలు గోలలూ.. ఒక్కడూ కుర్చీల్లో లేరు.. నిలబడి పూనకాలు తెచ్చుకుని ఊగిపోతున్నారు. సడెన్‌గా యాద్ ఆ రహా హే అని టోన్ మార్చగానే అందరిలో ఉత్కంఠత.. ఇక పాడలేను అని మిథున్ చక్రవర్తి నిస్సహాయంగా చూస్తుంటే జిమీ జిమీ ఆజ ఆజా అని హీరోయిన్ అందుకుని పాడుతుంది చూశారూ.. కర్చీఫులు తడిసిపోయాయ్.. ఎంతలా అంటే థియేటర్లో అందరం నిల్చుకుని కమాన్ మిథున్ కమాన్ అంటూ డాన్స్ చెయ్యమని కన్నీళ్ళతో వేడుకునేంత.. అసలా పాటలేంటి..ఆ డ్యాన్స్ లేంటి.. అదరహో..బప్పీ లహరి మ్యూజిక్‌తో చింపేసాడు. దానికి తోడు మిథున్ మ్యాజిక్ సినిమాని మా విజయవాడ లాంటి నాన్ హిందీస్ ఎక్కువగా ఉన్న చోట కూడా వంద రోజులు దాటించేసి సూపర్ డూపర్ హిట్ చేసేసింది.

ఐయామ్ ఎ డిస్కో డ్యాన్సర్..
ఐయామ్ ఎ డిస్కో డ్యాన్సర్..
జిందగీ మేరా గాన

ఈ పాట రాగానే థియేటర్లో పూనకాలు లోడింగ్.. ఆ పూనకాలు తెచ్చుకున్నవాడిలో నేనూ ఒకడ్ని... డిస్కో డ్యాన్సర్ విజయవాడ శాంతి థియేటర్లో వచ్చింది. మామూలుగా మనకూ హిందీకి ఆమడ దూరం. అప్పట్లో హిందీ ట్రై చేద్దామని సెకండ్ లాంగ్వేజ్ హిందీ తీసుకుని అదృష్టవశాత్తూ స్టాంపు మార్కులతో బయటపడ్డా.. హిందీకి పాస్ మార్కులు ఇరవై మాత్రమే అవడం నా అదృష్టం కాక ఇంకేవిటి? నాకు హిందీ నేర్పాలని ప్రయత్నించి మా హిందీ మాస్టారు నాగేశ్వరరావు గారు హిందీతో పాటు తెలుగు కూడా పూర్తిగా మర్చిపోయారు. అలా ఉండేది మన హిందీ పాండిత్యం..

సరే ఇప్పుడు విషయానికి వస్తే.. శాంతి థియేటర్లో డిస్కో డ్యాన్సర్ రిలీజ్ అయ్యింది. ఆ కుర్రాడెవరో మిథున్ చక్రవర్తి అంట.. అసలు మైకేల్ జాక్సన్ ఎందుకు పనికొస్తాడు. సినిమా మొత్తం ఒక్కడే ఊపేశాడు.. అనే టాకు ఆ నోటా ఈ నోటా నా చెవిన పడింది. ఎలాగైనా సినిమా చూడాలని బలంగా పడిపోయింది. మరి హిందీ సంగతెలా అని సంశయంలో ఉండగా ఈ సినిమాకి అసలు భాషతో సంబంధం లేదు.

ఆ పాటలు.. ఆ మ్యూజిక్కు.. అవే మ్యాజిక్కు.. అని తోటి పిల్లగాళ్ళు రెచ్చగొట్టటంతో అందరం కలిసి సినిమాకి వెళ్లాం. థియేటర్లలోకి వెళ్ళామా.. అంతే.. ఏదో ట్రాన్స్‌కి వెళ్ళిపోయాం. ప్రతి ఫ్రేమ్‌లోనూ మిథున్ చక్రవర్తిని కళ్ళార్పకుండా చూస్తూ ఉండిపోయాం..ఎంతలా అంటే.. ఒక్క క్షణం మిథున్ అలా పక్కకెళ్తే మళ్ళీ సీన్‌లోకి ఎప్పుడొస్తుస్తాడా అని కళ్ళల్లో పెట్రోమాక్స్ లైట్లు వేసుకుని చూసేంత..

ఆనాడు యావత్తు ప్రపంచాన్ని తన పాటలతో ఉర్రుతలూగించిన ఆ కుర్రాడు మిథున్ చక్రవర్తికి తన 74వ ఏట దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ వచ్చిన సందర్భంగా అభినందనలు..

హైదరాబాద్, కాచిగూడలో మహేశ్వరి, పరమేశ్వరి జంట థియేటర్లు.. ఒక దాంట్లో అమితాబ్ ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ నమక్ హాలాల్.. మరో దాంట్లో ఈ డిస్కో డాన్సర్.. పాటలకు తగినట్టుగా ఆరుతూ వెలుగుతూ లైట్లు డిస్కో పాటలకు.. అప్పట్లో మామూలు సందడి కాదు కాచిగూడ చౌరస్తాలో!!

- పరేష్ తుర్లపాటి


## శివపార్వతులుగా చై-సాయిపల్లవి!!



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం తండేల్. చందూ మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో జరిగిన నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. శ్రీకాకుళం అంటే గుర్తుకు వచ్చేది శ్రీ ముఖలింగ ఆలయం. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ అలయలంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. తండేల్ సినిమాలో మహాశివరాత్రి సీక్వెన్స్ వుంది. భారీ సెట్టింగ్స్‌తో శివరాత్రి సాంగ్‌ని షూట్ చేశారు. శివనామ స్మరణ మారుమ్రోగేలా దేవిశ్రీప్రసాద్ ఓ ట్యూన్ ఇచ్చారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటలో నాగచైతన్య, సాయి పల్లవి, దాదాపు వెయ్యి మంది డ్యాన్సర్లతో కలిసి ఆడిపాడారు. నెవర్ బిఫోర్ రేంజ్‌లో ఈ పాటని తెరకెక్కించామని చిత్రబృందం చెబుతోంది. టీమ్ రిలీజ్ చేసిన స్టిల్ లో నాగచైతన్య, సాయిపల్లవి శివ పార్వతులగా నృత్యం చేస్తూ కనిపించడం అభిమానులని అలరించింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని విడుదల చేయబోతున్నారు. త్వరలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తారు. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

## సూపర్ స్టార్ రజనీకి ఏమైంది?

సోమవారం రాత్రి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరిన వైనం కాస్త ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ న్యూస్ ఈ రోజు ఉదయం (మంగళవారం) బ్రేక్ అయ్యింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లుగా మీడియా వర్గాలు చెబుతున్నాయి. కంగారు పడాల్సిన అవసరం లేదని.. ఆయన బాగున్నట్లుగా తమిళ మీడియా చెబుతోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. దీనికి సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. అటు అపోలో ఆసుపత్రి వర్గాలు కానీ.. ఇటు రజనీకాంత్ కుటుంబ సభ్యుల నుంచి కానీ ఎలాంటి ప్రకటనా లేదు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఆధ్వర్యంలో రజనీకి ముందస్తు చికిత్సలో భాగంగా ఎలక్టివ్ ప్రొసీజర్ కోసం ఆస్పత్రిలో చేరినట్లు చెబుతున్నారు. అయితే.. ఇది కూడా అధికారిక సమాచారం కాకపోవటం గమనార్హం. గతంలో రజనీకాంత్ మెదడు రక్తనాళంలో బ్లాక్స్ ఏర్పడటంతో కావేరీ ఆసుపత్రిలో చేరటం.. తక్షణం స్పందించిన వైద్యులు ఆయనకు చికిత్స చేసి వాటిని అప్పట్లో తొలగించారు. ఆ ప్రక్రియ సక్సెస్ కావటంతో ఆయన త్వరగా కోలుకున్నారు. రజనీకాంత్ కు గతంలో కిడ్నీ మార్పిడి కూడా జరిగింది. ప్రస్తుతం ఆయన కిడ్నీలకు ఎలాంటి సమస్యలు లేవు. మొత్తంగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయనకు పలు వైద్య పరీక్షలు చేశారని చెబుతున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నా.. రజనీ ఫ్యాన్స్ మాత్రం ఆందోళనతో ఉన్నారు. కుటుంబ సభ్యుల నుంచి కానీ అధికారిక ప్రకటన వెలువడితే కొంత ఊరట చెందే వీలుంది. - తుపాకి.కామ్ సౌజన్యంతో...



# ఉగ్రవాదంతో కాదు.. వాటికి ఊతంగా నిలిచే పార్టీలతోనే

# మనకు అసలు డేంజర్!



**ఈ స్టోరీ చదివితే ఇజ్రాయిల్ ఏ రేంజులో తన శత్రువుల మీదకు పంజాలు విసురుతుందో అర్థమవుతుంది.**

చిక్కుముడి వీడింది. ఇరాన్ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ 2024 మే 19న అజర్ బైజాన్ సరిహద్దులో హెలికాప్టర్ కూలిపోవడం వలన చనిపోవడం తెలిసిందే. అయితే హెలికాప్టర్ ప్రమాదం మీద ఇప్పటి దాకా మిస్టరీగా ఉండేది. కానీ ఇబ్రహీం రైసీ కూడా పేజర్ వాడేవాడు. ఆ రోజు హెలికాప్టర్ ప్రమాదం జరిగిన రోజు కూడా కూలిన శిథిలాల్లో కాలిపోయిన పేజర్ కూడా దొరికింది. కానీ అది హెలికాప్టర్ కూలడం వలన చెలరేగిన మంటల్లో కాలిపోయి ఉండవచ్చని అనుకున్నారు. అయితే ఇప్పుడు చిక్కుముడి వీడింది!

ఇబ్రహీం రైసీ వ్యక్తిగత బాడీగార్డు అజర్ బైజాన్ వెళ్లేటప్పుడు ఒకే హెలికాప్టర్‌లో ప్రయాణించారు. కానీ తిరిగి వచ్చేటప్పుడు మాత్రం రైసీ బాడీగార్డు వేరే హెలికాప్టర్‌లో ఎక్కాడు. అంటే రైసీ హెలికాప్టర్ కూలిపోతుందని బాడీగార్డ్‌కి ముందే తెలుసు. ఇబ్రహీం రైసీ వాడుతున్న పేజర్‌లో ట్రోజాన్ హార్స్ ఉండివుంటుంది. ఆ పేజర్ పేలిపోవడం వల్ల పైలట్ హెలికాప్టర్‌ని కంట్రోల్ చేయలేకపోవడంతో కూలిపోయింది. ప్రక్కన ఫోటోలో అజర్ బైజాన్‌కి వెళ్లేముందు అప్పటి అధ్యక్షుడు ఇబ్రహీం రైసీది. ఎదురుగా టేబుల్ మీద పేజర్ వుంది చూడండి.

ఇరాన్ సుప్రీం లీడర్ తన ముఖ్య అనుచరులతో ఒక రహస్య ప్రదేశానికి వెళ్లిపోయాడు భయంతో. మరోవైపు ఇజ్రాయేల్ ప్రధాని ఐక్యరాజ్య సమితిలో ప్రసంగిస్తూ నేరుగా ఆయుతోల్లా అలీ ఖోమెనీకి తీవ్ర హెచ్చరిక చేశాడు. తర్వాత ఏమిటి? నేరుగా ఇరాన్‌లోని అణు రియాక్టర్ల మీద దాడి చేయవచ్చు. ఐఆర్‌జీసీ (ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్)కి ఆదేశాలు ఎవరు ఇవ్వాలి? అంతా అయోమయంగా ఉంది ఇరాన్‌లో!





హెజ్బొల్లా కొత్త చీఫ్ హాసన్ ఖలీల్ యాసిన్ కూడా చంపబడ్డాడు. హెజ్బొల్లా చీఫ్ నజరల్లాహ్ మరణించిన వెంటనే హాసన్ ఖలీల్ యాసిన్‌ని హెజ్బొల్లాకి కొత్త చీఫ్‌గా నియమించారు. కానీ కొద్ది గంటల్లోనే హాసన్ ఖలీల్ యాసిన్‌ని కూడా చంపేసింది ఐడీఎఫ్. హెజ్బొల్లా చరిత్రలో అతి తక్కువ కాలం అంటే 7 గంటలు మాత్రమే ఈ టెర్రర్ గ్రూపుకి చీఫ్ కమాండర్‌గా ఉన్నాడు. ఎలా చంపబడ్డాడో వివరాలు ఇంకా తెలియదు. హెజ్బొల్లా అధినేతను చంపినప్పుడు తను దాక్కున్న పాతాళభవనాన్ని ఇజ్రాయిల్ బాంబులతో నేలమట్టం చేసిన ఫొటో ఇది.

అత్యంత సుశిక్షిత సాయుధ ఉగ్రవాద బలగాలున్న సంస్థగా హెజ్బొల్లాకు పేరుంది. వాకీటాకీలు, పేజర్లు, ఫోన్లలో బాంబులు పెట్టి మరీ దాని వెన్నువిరిచిన ఇజ్రాయిల్ దాని చీఫ్‌లను కూడా ఎలా పర్‌ఫెక్ట్ ఆపరేషన్‌తో ఖతం చేసిందో చదివాం. ఇరాన్ మాజీ అధ్యక్షుడినీ హతం చేసింది. ఒకసారి ఇజ్రాయిల్ హిట్‌లిస్టులో పేరెక్కితే ఇక ఆ పేరును ఎప్పుడోసారి కొట్టేయాల్సిందే. మొస్సాద్, ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్, మరేదో సంస్థ.. ఏదైతేనేం..? ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయిల్‌ది మామూలు టెంపర్‌మెంట్ కాదు. ఆ ఉగ్రవాద సంస్థలన్నింటికీ యూదులే కాదు, హిందూ జాతి కూడా టార్గెటే. కానీ ఇజ్రాయిల్ సాగిస్తున్న పోరాటంతో పోలిస్తే మనమెక్కడున్నాం? జాతిని రక్షించుకునే ఓ రకమైన కసి ఉందా మనలో..?

మొన్న హెజ్బొల్లా అధినేత మరణానికి సంతాపంగా ముఫ్తి మెహబూబా ఓరోజు ప్రచారాన్ని మానేసింది. ఇదుగో ఇలాంటోళ్లను మన దేశం మోస్తోంది. ఇదే బీజేపీ ఆమెతో పొత్తు పెట్టుకుని పెత్తనాలు చేసింది. మనం పార్టీల కోణంలోనే చూస్తాం అన్నీ. దిక్కుమాలినతనంతో మన జాతికి మనమే సమాధులు కట్టుకుంటున్నాం.

హర్యానా కాంగ్రెస్ మీటింగుల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ కిక్కుమనదు, అంటే సరేనని ఆమోదిస్తున్నదా..? హెజ్బొల్లా చీఫ్ హత్యకు నిరసనగా కాశ్మీర్‌లో ఊరేగింపులు సాగుతున్నాయి. ఇంకోవైపు అమిత్ షా ఉగ్రవాదం ఖతమైపోయిందని ప్రచార సభల్లో గొప్పలు చెప్పుకుంటున్నాడు. ఆర్టికల్ 370 ఎత్తివేత వంటి ఒకటీ అరా నిర్ణయాలతో బీజేపీ కాస్త బెటర్. కాంగ్రెస్ దాన్ని పునరుద్ధరిస్తుందట. ఉగ్రవాదానికి ఇందిరను, రాజీవ్‌ను పోగొట్టుకున్నా సరే, రాహుల్ మారరు, కాంగ్రెస్ మారదు. రోహింగ్యాలు, వలస బంగ్లాదేశీయులకు రెడ్ కార్పెట్ పరిచే మమత మరో డేంజర్ మన జాతికి. అవును, మన జాతికి ఉగ్రవాదం కాదు.. అసలు సిసలు ముప్పు మన రాజకీయ పార్టీల భావజాలాలు, ఉగ్రవాదాలకు దాస్యం చేసే సైద్ధాంతిక దివాలాకోరుతనం.

**- పొట్లూరి పార్థసారథి**

## అండర్-19లో మెరిసిన ఎస్ఆర్ఆర్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బీసీసీఐ నిర్వహిస్తున్న అండర్-19 వినూ మన్కడ్ ట్రోఫీ 2024-25కి గాను ఎస్ఎస్ఆర్ క్రికెట్ అకాడమీ నుంచి ఎంపికవడం జిల్లాకు గర్వకారణమని సంస్థ శిక్షకులు ఎస్‌హెచ్ శ్రీనివాస్, టీ.శ్రీచరణ్ అన్నారు. శ్రీకాకుళంలోని బగ్గు సరోజినీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఆర్ క్రికెట్ అకాడమీ నుంచి మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసారు. అకాడమీ నుంచి అండర్-15కి సెలెక్ట్ అయిన మహిళా యువ క్రికెటర్లు కూడా ఉన్నారని, వారందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై బాబు హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)




గతంలో మొగదాలపాడు గ్రామంలోని 1083 ఓటర్లు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొమరవానిపేట పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేవారని, ఇకనుంచి మొగదాలపాడులోనే ఓటుహక్కు వినియోగించవచ్చని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజె బాబు అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఎం.అప్పారావు సమక్షంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులతో జరిగిన సమావేశంలో మొగదాలపాడులో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్టు బాబు తెలిపారు. అలాగే 675 ఓటర్లతో చల్లవానిపేటలో, ఇచ్ఛాపురం నియోజకవర్గం బెజ్జిపుట్టుగ పోలింగ్ కేంద్రం నుంచి విడదీసి 1298 ఓటర్లతో దూగానపుట్టుగలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. గతంలో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బెజ్జిపుట్టుగ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేవారు. పాతపట్నం నియోజకవర్గంలో కోరాడ సుబలయి ఆర్ అండ్ ఆర్ కాలనీలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఓటర్ల జాబితాల సవరణకు అక్టోబర్ 29న ముసాయిదా ఓటర్ల జాబితాలు 2357 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురణ చేస్తారని, నవంబరు 28 వరకూ కొత్తగా ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలకు ఫారం 6,7,8 స్వీకరిస్తారని తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితా సవరణలో తెలుగుదేశం పార్టీ బూత్ ఏజెంట్లు, పార్టీ శ్రేణులు దృష్టి సారించి బీఎల్‌వోల సమన్వయంతో స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలు తయారీకి చర్యలు తీసుకోవాలని బాబు కోరారు.

## పింఛన్లతో పేదలకు ఆర్థిక పరిపుష్టి

(సత్యంన్యూస్, బూర్జ)

పింఛన్లతో పేదలకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందని కళింగ సంక్షేమ సంఘం రాష్ట్రశాఖ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఓపీవాడ వెంకంపేటలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీఎస్ఎన్ రాజు, బుడుమూరు మురళీధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ త్రినాధ రావు, గ్రామ వైద్య సహాయకురాలు బుడుమూరు సత్యవతి, గ్రామపంచాయతీ వెలుగు సీఎఫ్ గురుగుబెల్లి వసంతకుమారి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**లయన్స్ వైద్యులు బొడ్డేపల్లి సురేష్, పైడి సింధూర**

ఏటా ప్రపంచవ్యాప్తంగా 3 లక్షల మందికి పైగా పిల్లలు క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో బాల్య క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి, ప్రముఖ వైద్యురాలు పైడి సింధూర మాట్లాడుతూ బాల్యంలోనే క్యాన్సర్ రావటం దురదృష్టకరమని, పెద్దల శరీరంలో క్యాన్సర్ లక్షణాలను గమనించవచ్చని, పిల్లల్లో క్యాన్సర్‌ను గుర్తించడం చాలా కష్టమన్నారు. వీలైనంత వరకు ఆరుబయట లభించే ఆహారపదార్థాలను దూరం పెట్టాలని, ప్రతిరోజూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, మంచి అలవాట్లతో మన ఆరోగ్యం పదిలమన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అక్షర పాఠశాలలో నిర్వహించిన పీస్ పోస్టర్ కాంటెస్ట్‌లో ఉత్తమ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ సురేష్, డాక్టర్ సింధూర, ఇతర సభ్యులు, పాఠశాల డైరెక్టర్ బొంది పవన్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం డీసీ బాడాన దేవభూషణరావు, సభ్యులు టెక్కం రామ్‌గోపాల్, శిల్లా మనీ, ఈనాడు ఈశ్వరరావు, పొడుగు చరణ్, పాఠశాల చైర్మన్ మైలపల్లి సూరిబాబు, కరస్పాండెంట్ మైలపల్లి హరిత, డైరెక్టర్ బొంది పవన్‌కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వజనీన గ్రంథం భగవద్గీత

(సత్యంన్యూస్, జి.సిగడాం)

మతాలకు అతీతమైన విశ్వజనీన గ్రంథం భగవద్గీత అని కె.జి.బి.వి ప్రిన్సిపాల్ దాసరి ఉషారత్నకుమారి అన్నారు. మానవ జీవితంలో భగవద్గీత చదవటం వల్ల కర్తవ్య దీక్ష, మానవతా విలువలు పెంపొందించేందుకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పంపిణీ చేసిన 'మానవులందరికీ భగవద్గీత' అనే పుస్తకాలను మంగళవారం కె.జి.బి.వి.లోని 283 విద్యార్థులకు పంపిణీ చేశారు. భగవద్గీత మతగ్రంథం కాదని, మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్దే గ్రంథమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా మేనేజర్ ఎం.లలితమణి, సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రశంసలందుకున్న తైలవర్ణ చిత్రాలు

(సత్యంన్యూస్, పొందూరు)

బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నేపథ్యంలో స్థానిక చిత్రకారుడు కేత శ్రీను తైలవర్ణ చిత్రాలను రూపొందించారు. ఈ చిత్రాలు ఎంతో సహజసిద్ధంగా ఉండి ఆకట్టుకుంటున్నాయి. గత 15 ఏళ్లుగా ఎన్నో తైలవర్ణ చిత్రాలను గీసి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 150 చిత్రాలను గీశారు. కళింగాంధ్రలో నాటి ప్రఖ్యాత కవి అడిదం సూరకవి చిత్రం ఎక్కడా దొరక్కపోతే భక్తి సమాచారం మాస పత్రిక (విజయనగరం) కోరిక మేరకు ఓ ఊహా చిత్రాన్ని శ్రీను రూపొందించి కృతకృత్యుడయ్యాడు. ముంబయిలోని ఓ విద్యాలయం నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్నాడు.































## తాగకుండా వీరు.. అమ్మకుండా వారు ఉండలేరు!

(మొదటిపేజీ తరువాయి)

ఊరుకుంటామా..? అస్సలు కుదరదు. మంచి నీళ్లు దొరక్కపోయినా ఫర్వాలేదు కానీ, మందు దొరక్కపోతే అల్లాడిపోతాం. నరాల్లో రక్తప్రవాహం ఆగిపోతుంది. కాళ్లు, చేతులు వణికేస్తాయి. అందులోనూ రాత్రి బాగా తాగేసుంటామేమో.. హ్యాంగోవర్ పెగ్గు కోసం షాప్ కీపర్ కంటే ముందే ఆ మెట్లు మీద దేబరిస్తుంటాం. అటువంటిది షాపులు బంద్ చేస్తాం, మందు అమ్మేది లేదంటే ఊరుకుంటామా?

రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ అమలులోకి రానుండటంతో ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లకు పని లేకుండాపోయింది. దీంతో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వీరంతా మంగళవారం విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం మద్యం షాపులు తెరుచుకోలేదు. ఈ విషయం తెలియని మనోళ్లు ఎప్పటిలాగే ఉదయాన్నే ఓ క్వార్టర్ కోసం షాపుల వద్ద బారులు తీరారు. ఉదయం 10 దాటింది, 11 దాటింది, 12 దాటింది.. అయినా షాపులు తెరుచుకోపోవడంతో మందుబాబుల ప్రవాహం షాపుల వద్ద పెరిగింది. మందు లేకుండా మద్యం ప్రియుడు ఎలా ఉండలేడో, అది అమ్మకుండా ప్రభుత్వం కూడా ఒక్కరోజు ఉండలేదని నిరూపించారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతానికి ఎక్సైజ్ అధికారులు పోలీసుల సహకారంతో రంగంలోకి దిగిపోయారు. నగరంలో గవర్నమెంట్ షాపులను తెరిచారు. స్వయంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లే షాపుల్లో కూర్చుని మంగళవారం మద్యాన్ని విక్రయించారు. దీంతో మద్యం షాపుల్లో నిన్నటి వరకు పని చేసి సేల్స్‌మెన్లు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎలాగూ తమ ఉద్యోగాలు పోయాయి కాబట్టి కొత్తగా పీకేదేమీ లేదని ఎక్సైజ్ అధికారుల మీద తిరగబడ్డారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కస్టమర్ శాటిస్‌ఫేక్షనే తమ అంతిమ లక్ష్యమని ఎక్సైజ్ అధికారులు మద్యాన్ని విక్రయించి ఆర్చుకుపోయిన నాలుకను తడి చేశారు. అయితే ఎక్సైజ్ అధికారులకు అమ్మడం రాదు కదా.. ఎలా విక్రయించారన్న డౌట్ వస్తే, అందుకు మన బార్ యజమానులు సహకరించారు. ప్రైవేటు బార్లలో పని చేస్తున్న సేల్స్‌మెన్లను, బాయ్‌లను రంగంలోకి దించి ఒక్కో షాపులో ఒక్కో ఎక్సైజ్ అధికారిని కూర్చోబెట్టి ఎంచక్కా మందును సరఫరా చేశారు. బాబ్బాబూ.. ఉల్లి పాయలు బాగా రేటు పెరిగిపోయాయి, మార్కెట్‌లో కొందామన్నా దొరకడంలేదని ఆమధ్య ఆంధ్రజ్యోతిలో ఓ కథనం వస్తే నాలుగు రోజుల వరకు దీని మీద సంబంధిత అధికారులు ఎవరూ వివరణ ఇవ్వలేదు. కానీ అదే ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వ షాపుల్లో మద్యం సరిపడినంత దొరకడంలేదని వార్త ప్రచురిస్తే ఆ సాయంత్రానికే కావలసినంత మందుంది, తాగినంత తాగండి, తూగినోళ్లు తూగండి అని ప్రభుత్వం తరఫున ఓ ప్రకటన విడుదలైంది. మద్యం తాగకుండా మందుబాబు ఒక రోజు ఉండగలడేమో గానీ, అమ్మకుండా ప్రభుత్వం మనుగడ సాగించలేదు.

## అమ్మోరు దొంగలు దొరికారు!


(మొదటిపేజీ తరువాయి)

దేవాలయాల్లో నేరాలకు పాల్పడుతున్న ముఠాపై ప్రత్యేక దృష్టి సారించామని, అందులో భాగంగానే డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో రణస్థలం సీఐ అవతారం ఆధ్వర్యంలో ఎనిమిది మంది పోలీస్ టీమ్ అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పాత నేరస్తుల కదలికపై నిఘా పెట్టి నిందితులను పట్టుకున్నామన్నారు. జిల్లాలో 31 దేవాలయాల్లోను, 4 గృహాల్లోను, ఒక చర్చి, మూడు రైస్‌మిల్లుల్లో దొంగతనాలకు పాల్పడ్డారని, విశాఖపట్నం, అంబేద్కర్ కోనసీమ, తెలంగాణ రాష్ట్రంలో కూడా పలు నేరాలకు వీరు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో ఐదుగుర్ని మీడియా ముందు ప్రవేశపెట్టగా, మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ కేసును ఛేదించిన ప్రత్యేక బృందంలో ఉన్న సీఐలు ఎం.అవతారం, జె.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు వి.సందీప్‌కుమార్, జి.లక్ష్మణరావు, బి.నిహాల్, ఎం.వెంకటరావులతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.శ్యామలరావు, ఎం.శ్రీనివాసరావు, కె.కిరణ్‌సింగ్, కె.హేమసుందర్, ఇ.తారకేశ్వరరావు, కానిస్టేబుళ్లు కె.భాస్కరరావు, కె.సురేష్, ఎం.నీలకంఠం, ఆర్.సూరిబాబు, కె.లక్ష్మణరావు, పి.స్రవంతిలను ఎస్పీ అభినందించారు.

# కలెక్టర్‌కే కహానీలు!

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డర్ (ఎంఎన్‌వో), ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ (ఎఫ్ఎన్‌వో), స్వీపర్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో నియమించారు. ఆ తర్వాత అదే ఏడాది సెప్టెంబరు 26న ఇదే నిహాల్ సంస్థ నుంచి పర్మినెంట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మరో 31 మంది ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలను నియమించారు. ఇందులో తాత్కాలిక పద్ధతిలో నియమితులైనవారిని కోవిడ్ ముగిసిన తర్వాత విధుల నుంచి తప్పించేశారు. కానీ పర్మినెంట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వచ్చిన 31 మందికి జిల్లాలో ఉన్న వివిధ పీహెచ్‌సీల్లో పోస్టింగ్ చూపిస్తూ కోవిడ్ కష్టకాలంలో జెమ్స్‌లో కొందరికి, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో కొందరికి, పీహెచ్‌సీల్లో మరికొందర్ని కొనసాగించారు. ఎందుకంటే.. వీరు పర్మినెంట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది. వీరికి ఆప్కాస్ ద్వారా జీతాలు అందించాల్సి ఉంది. కానీ వీరి సేవలు 20 నెలలు వాడుకొని ఇప్పుడు గాలిలో పెట్టేశారు. తమను కొనసాగించాలని అప్పటి జిల్లా కలెక్టర్‌కు వీరు మొరపెట్టుకుంటే, వీరి నోటిఫికేషన్, అపాయింట్‌మెంట్ పద్ధతిని పరిశీలించిన కలెక్టర్ వీరిని ఏం చేయాలంటూ అప్పటి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఒక లేఖ రాశారు. పీహెచ్‌సీల్లో ఉన్న ఖాళీల మేరకు వీరిని కొనసాగించవచ్చని కమిషనర్ సమాధానమిచ్చారు. కానీ ఈ లేఖ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరక ముందే వీరి స్థానంలో సొమ్ములు



OFFICE OF THE DISTRICT MEDICAL AND HEALTH OFFICER : : SRIKAKULAM

Rc. No. 590/ G1/2020, dated 26.09.2020

Sub: - Recruitments – Certain Addl. MNOs and FNOs including regular vacancies who are appointed by outsourcing agency on contract basis movement orders – Issued.

Ref:- 1) This office Rc.No.590/G1/2020, Dt.25.08.2020
2) Rc.No.7714/E4/2020 Dt.20.06.2020 of the Director Public Health and Family Welfare, AP, Vijayawada, Read with GO.Ms.No.60,62,63,64 HM&FW(A1) Department, Dt: 10.06.2020.
3) Note Orders Dt.24.08.2020 of the Collector and District Magistrate, Srikakulam.
4) Orders issued by the M/s NIHHALL Infrastructure Contractors, Srikakulam.
5) Individuals Joining Report, Dated. 26.09.2020.

&&&

In view of the orders issued by the Director of Public Health and Family Welfare AP, Vijayawada through the reference 2nd cited above and in accordance with the note orders issued by the Collector and District Megistrate Srikakulam through the references 3rd cited above and given by the M/s NIHHALL Infrastructure Contractors, Srikakulam through the references 4th above the following candidates appointed as Addl. MNOs and FNOs existed in newly created posts including with the regular vacancies, therefore the employees approached to this office for further the details of reporting and designations noted against the name of the individual.

| S.NO | NAME OF THE CANDIDATE | APPOINTMENT BY DESIGNATION | PLACE OF POSTING | DATE OF REPORTING TO THIS OFFICE |
| --- | --- | --- | --- | --- |
| 1 | Kanusu Atchuta | M N O | PHC Veeraghattam | 26.09.2020 |

In View of the above the District Medical & Health Officer, Srikakulam is hereby issued the following orders with immediate effect.


The above employee are directed to report before the medical officers of PHC noted in colum.No. 4 without fail.

రెండో నోటిఫికేషన్ ద్వారా ఇచ్చిన ఓ పాయింట్‌మెంట్ ఆర్డర్

ముట్టజెప్పినవారికి ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలుగా నియమించేశారు. దీంతో చేసేది లేక బాధితులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తే, వీరి వినతి మేరకు ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, ఆ తర్వాత ఇందుకు సంబంధించిన లోటుపాట్లు ఉంటే రిమార్కులు కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. కానీ ఈ ఆదేశాలను అమలుచేయకుండా రూ.2 లక్షలకు ఒక పోస్టును ఫిల్ చేసేశారు. ఇది అన్యాయమని, కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని బాధితులు మళ్లీ కోర్టును ఆశ్రయించాలని చూశారు. కానీ కంటెప్ట్‌కు వెళ్లకుండా ఉద్యోగాలిస్తామని ఆశ చూపించి, ఇన్నాళ్లూ వారి వెనుక తిప్పి, ఇప్పుడు ఉద్యోగాలు లేవని, అసలు ఈ 31 మందిని నియమించిన నోటిఫికేషనే లేదని తేల్చి చెప్పేస్తున్నారు. వాస్తవానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది కోర్టుకు సమర్పించి వీరు కంటెప్ట్ కేసు వేశారు. ఇందులో జిల్లా కలెక్టర్ కూడా ఒక పార్టీగా ఉన్నారు.

### అసలేం జరిగింది?

వీరికి ఉద్యోగాలిచ్చి నాలుగు వారాల్లో రిమార్కులు సమర్పించాలని కోర్టు కోరితే, ఎటువంటి వివరాలు కోర్టుకు ఇవ్వలేదు సరికదా, జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫైల్‌లో వీరు నోటిఫికేషన్ ప్రకారం రాలేదని అబద్ధాలు చెప్పారు. కోవిడ్ సమయంలో మొదట ఇచ్చిన నోటిఫికేషన్‌లో 71 మందిని తీసుకున్నారు. ఆ తర్వాత 31 మందిని తీసుకున్నారు. ఇందులో 71 మందికి కోవిడ్ నిధుల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉండగా, 31 మందికి ఆప్కాస్ ద్వారా 010 సీఎఫ్ఎంఎస్ అకౌంట్ నుంచి జీతాలు రావాల్సి ఉంది. కానీ అప్పట్లో ఏవోగా పని చేసిన పక్కి చిట్టిబాబు, సూపరింటెండెంట్‌గా ప్రస్తుతం చేస్తున్న భాస్కర్ కుమార్‌కు మధ్య నిహాల్ ఔట్‌సోర్సింగ్ సంస్థ ఇచ్చిన సొమ్ముల పంపకంలో తేడా రావడంతో అందరికీ కోవిడ్ నిధుల నుంచే జీతాలు ఇచ్చారు. ఇప్పుడు కోవిడ్ లేదు, ఆ నిధులూ లేవు కాబట్టి వీరిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టేనని సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్ భావించారు. వాస్తవానికి వీరిది పర్మినెంట్ ఔట్‌సోర్సింగ్ నోటిఫికేషన్. ఇటీవల ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో రీ-డిప్లాయ్‌మెంట్ కోసం 143 జీవోను తీసుకువచ్చింది. దీని ప్రకారం ఒక పీహెచ్‌సీలో ఏయే కేడర్లలో ఎంతమంది సిబ్బంది ఉండాలనేది పేర్కొంది. అందులో ఒక పీహెచ్‌సీకి గరిష్ఠంగా 12 మంది ఉద్యోగులు ఉండాలి.



(SHOW CAUSE NOTICE BEFORE ADMISSION)
IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI
(ORIGINAL JURISDICTION)
TUESDAY, THE SIXTH DAY OF AUGUST
TWO THOUSAND AND TWENTY FOUR
:PRESENT:
THE HONOURABLE SRI JUSTICE GANNAMANENI RAMAKRISHNA PRASAD
CONTEMPT CASE NO: 3201 OF 2024

Between:

1. Tandyala Sudhababu, S/o Ramarao, Aged 41 years, Occ MNO, R/o D.No.1-157, Main Street, Boddapadu, Budithi, Jalumuru Mandal, Srikakulam District.
2. Kanusu Atchuta, S/o Lakshmana Rao, Aged 34 years, Occ MNO, R/o D.No.1-8, Komanapalle, Jalumuru Mandal, Srikakulam District.
3. Baddi Ramadevi, W/o Aged 33 years, Occ FNO, R/o D.No.1-55, Maluva Village, DhanupuramPost, SaravakotaMandal Srikakulam District.
4. Kuppili Rupavathi, W/o, Aged 44 years, Occ FNO, R/o D.No.2-75, Rajam, Vizianagaram District.
5. Sanagala Kumari @ Mutchi Kumari, W/o Mutchi Nagaraju, Aged 41 years, Occ FNO, R/o D.No.34-136, Gowdu Street, Bobbili, Vizianagaram District.

...Petitioners

AND

1. Dr. Manazir Jeelani Samoon, IAS, S/o Not Known to the Petitioners

కోర్టు ధిక్కరణ కింద కేసు నమోదైన పత్రం

ఇందులో ఎక్కడైతే తక్కువున్నారో, అటువంటి చోట్ల డబ్బులు తీసుకొని ఎంఎన్‌వోలను, ఎఫ్ఎన్‌వోలను నియమించేశారు. వాస్తవానికి రెండో నోటిఫికేషన్ ద్వారా వచ్చిన 31 మందినీ రీ-డిప్లాయ్‌మెంట్‌లో పీహెచ్‌సీలకు సర్దాలి. అలాకాకుండా సూపరింటెండెంట్‌కు సొమ్ములిచ్చినవారికి ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలుగా పీహెచ్‌లకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి రెండో నోటిఫికేషన్ ద్వారా వచ్చిన ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు ఇప్పటికీ పని చేస్తున్నారు. కానీ శ్రీకాకుళంలో మాత్రం భాస్కర్‌కుమార్ వీరిని హోల్డ్‌లో పడేశారు. వాస్తవానికి వీరు కోవిడ్ వర్కర్లు కాదు. పీహెచ్‌సీల్లో తక్కువ స్టాఫ్ ఉండటం వల్ల ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నవారు. కోవిడ్ వచ్చింది కాబట్టి వేర్వేరు చోట్ల సేవలందించారంతే. ఎప్పుడైతే బాధితులు కోర్టు కంటెంప్ట్‌కు వెళ్లారో, అసలు రెండోసారి నోటిఫికేషనే ఇవ్వలేదని దబాయించేస్తున్నారు. మొదటిసారి ఇచ్చిన నోటిఫికేషనే వేలిడ్ అని, అందులో ఉన్నవారినందర్నీ కోవిడ్ తర్వాత తొలగించేశామని, వీరూ అందులో భాగమని చెబుతున్నారు. కానీ ఏం జరిగిందనేది అప్పుడు జిల్లా కలెక్టర్‌గా, ఆ తర్వాత వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌గా పని చేసిన నివాస్‌కు తెలుసు. వైద్య ఆరోగ్య శాఖలో వీరికి సంబంధించి ఏ ఒక్క ఫైలూ సరిగ్గా లేదు. ఉన్నవాటిని మాయం చేశారు. ఇప్పుడు కలెక్టర్ అడిగితే కొత్త కాగితాలు చూపిస్తున్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం సంబంధిత పత్రాలు అడిగితే, ఇవ్వడంలేదు. కానీ బాధితుల వద్ద ఇందుకు సంబంధించిన ప్రతీ పత్రం ఉందని, ఇప్పుడు ఫ్యాబ్రికేట్ చేసిన కాగితాలు కలెక్టర్‌కు చూపించి ఆయన్ను ఇందులో ఇరికించడానికి ప్రయత్నిస్తున్నారన్న ప్రయత్నాన్ని భాస్కర్ కుమార్ గుర్తించడంలేదు.

## వేంకటేశ్వరాలయంలో ప్రాయశ్చిత్త పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గ జనసేన నాయకులు కొండా ఉదయ్ శంకర్, గురు ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో చిన్నబజార్‌లోని వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి పేరిట అర్చన చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని, దీనిని నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష పిలుపులో భాగంగా మంగళవారం లలితా మండలి సహకారంతో విష్ణుస్తోత్రం, గోవింద నామాలు, ఓం నమో నారాయణాయ మహా మంత్రాన్ని పఠించినట్టు తెలిపారు. జరిగిన అపవిత్రానికి ప్రాయశ్చిత్తంగా వేంకటేశ్వర స్వామిని క్షమాపణ వేడుకున్నామన్నారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రదీప్, కామేష్, అర్జున్, సుమన్, గౌరి నాగేంద్ర, తిరు ఐటి కోఆర్డినేటర్ విష్ణు ప్రియాంక, వీర మహిళలు బొడ్డి మోహన లక్ష్మి, సురాడ రమాదేవి, కలగ లక్ష్మి, గొర్లె అనురాధ, భూపతి ఆశ, చెక్క లక్ష్మి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## మొక్కులు చెల్లించుకున్న మంత్రులు

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

ఉత్తరాంధ్ర ప్రజల కొంగుబంగారమైన కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాల జాతర తొలిరోజు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ప్రభుత్వపరంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేసేలా అమ్మవారి జాతరను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అమ్మవారికి కేంద్ర, రాష్ట్రమంత్రుల కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.



## ఆడవరంలో శాఖాహార దినోత్సవం



(సత్యంన్యూస్, గార)

ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శాఖాహార దినోత్సవం నిర్వహించారు. క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, బెండకాయలు, టమాట, దోసకాయ, వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు విద్యార్థులు చూపిస్తూ ఆహారం ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎల్లప్పుడూ జంక్‌ఫుడ్స్ తీసుకోకుండా కూరగాయలు, పండ్లు, దుంపలు ఆహారంలో తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు విటమిన్ల గేయాన్ని ఆలపించి విద్యార్థులతో పాడించారు. కార్యక్రమంలో సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కొత్తమ్మ ఉత్సవాలు

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)


రాష్ట్ర పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రభుత్వం లాంచనాలతో నూతన వస్త్రాలు, కానుకలు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



## హైస్కూల్‌లో చెకుముకి ప్రతిభా పరీక్షలు

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు చెకుముకి వంటి ప్రతిభా పరీక్షలు దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారులు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు, ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో అశాస్త్రీయ భావనలు రూపుమాపి శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని ప్రశంసించారు. హైస్కూల్ హెచ్ఎం బరాటం కామరాజు మాట్లాడుతూ విద్యార్థులు చెకుముకి పోటీల ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని భావిజీవితంలో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా ఎందుకు, ఏమిటి, ఎలా అని ప్రశ్నించడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ చెకుముకి వంటి ప్రతిభా పరీక్షల ద్వారా విద్యార్థులలో పోటీ పరీక్షల పట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్లు ఎం.అసిరినాయుడు, జోగారావు, వెంకట రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ వైఖరి వంటివి పెంపొందించేందుకు చెకుముకి దోహదం చేస్తుందన్నారు. యూటీఎఫ్ నాయకులు డి.గణపతిరావు, ఫల్గుణరావు మాట్లాడుతూ విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. పోటీల్లో గెలుపొందినవారికి దివంగత రెడ్డి సోమన్న పేరిట వారి కుమారుడు, సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, దాలప్పన్న, మార్కండేయులు, మోహన్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.పాపారావు, డిగణపతిరావు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.



## అక్టోబర్ 2న ర్యాలీ విజయవంతం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలనే కుట్రతో ఆలోచన సాగిస్తుందని, దీన్ని సంఘటిత సమరశీల ఉద్యమం ద్వారా నిలవరించాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉమ్మడిగా ఉక్కు పిడికిలి బిగిద్దామని ప్రగతి మహిళా సంఘం శ్రీకాకుళం జిల్లా 7వ మహాసభ పిలుపునిచ్చింది. ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ రెండో తేదీన విశాఖలో ప్రజాసంఘాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని మహాసభ కోరింది. శ్రీకాకుళంలో జరిగిన పీఓడబ్ల్యు జిల్లా మహాసభల తీర్మానాల వివరాలను పీఓడబ్ల్యు జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ ప్రజా సంఘాల నాయకులతో కలిసి మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.గంగాభవాని, యం.లక్ష్మి, కార్యదర్శి పి.పద్మ, ఏఐకెయంయస్ రాష్ట్ర సహాయకార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ ప్రతినిధి శంబుడు జయలక్ష్మి పాల్గొన్నారు.



## పాఠశాలలు దసరా సెలవులు పాటించాల్సిందే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రంలోని 25జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ నెల మూడో తేదీ నుంచి 13 వరకు కచ్చితంగా పాటించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో శతశాతం సెలవులు అమలుపై తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలోని అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. వివిధ పాఠశాలల్లో దసరా సంబరాల పేరుతో పరోక్షంగా తరగతుల నిర్వహణ, టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ప్రయత్నిస్తే బాలల హక్కుల ఉల్లంఘనలుగా భావించి తాము ప్రత్యేక దృష్టి నిలుపుతామని, ఆయా పాఠశాలలపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలతో పాటు గుర్తింపు రద్దుకు సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.